# జంబూకం - లోభము

అనగనగా ఒక ఊర్లో ఒక వేటగాడు ఉండేవాడు. అక్కడికి దగ్గరలో ఉన్న అడవిలో ఒక నక్క ఉండేది. ఆ నక్కకి ఆశ చాలా ఎక్కువ. ఎప్పుడు ఏది దొరుకుతుందా అని ఆశగా ఎదురుచూస్తూ, దొంగతనంగా దొరికినవి ఎత్తుకుని వస్తూ ఉండేది.

సరే ఒక రోజు మన వేటగాడు వేట కోసమని, అడవికి బయలుదేరాడు. సరే సాయంత్రం దాకా వేటలో మునిగి పోయి ఒక జింకని చంపాడు. అలా జింకని భుజాన వేసుకుని వస్తూ ఉండగా ఒక అడివి పంది కనపడింది.

సరే అని చెప్పి, జింకని కింద పడేసి బాణం తీసుకుని అడివి పంది మీదకి వదిలాడు. అలా బాణం తగలగానే మన అడివి పంది కోరలు అవి భయంకరంగా పైకి ఎత్తి వేటగాడి మీదకి దూసుకుని వచ్చి వాడిని ఒక్క పోటు పొడిచి కింద పడి చచ్చిపోయింది.

ఆ పోటు దెబ్బ తిన్న మన వేటగాడు కూడ కింద పడి చచ్చిపోయాడు. సరే మన పంది అలా పరిగెత్తుకుంటూ వచ్చేటప్పుడు దాని గిట్టల కింద పడి ఒక పాము కూడా చచ్చిపోయింది.

ఇలా జింక, వేటగాడు, అడవి పంది, పాము అన్నీ చచ్చి పడి ఉండగా మన నక్క బావ అక్కడికి వచ్చింది.

ఇక ఇవి అన్నీ చూసి మన నక్క బావ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. " ఆహా ఇవ్వాళ్ళ పొద్దున్నే లేచి ఎవరి మొహం చూసానో, రెండు మూడు నెలలకి సరిపడా తిండి దొరికింది" అని అనుకుంటూ , దేన్ని



PDF created with pdfFactory trial version www.pdffactory.com

ఎప్పుడు తినాలో లొట్టలు వేసుకుంటూ ఆలోచించింది.
సరే ముందుగా ఇవి అన్నీ నా బొరియలోకి తీసుకుని పోతాను అని అనుకుని అక్కడ ఏదీ కూడా వదలకూడదు అని నిశ్చయించుకుని మన వేటగాడి విల్లుకి ఉన్న నారి ( ఇది మాంసంతో తయారు చేసే వాళ్ళు మన పూర్వీకులు) పుటుక్కున తెంపబోగా, అది రయ్యిన తెగి వేగంగా గుండెకు వచ్చి కొట్టుకుని మన నక్క బావ కూడా హరీ మన్నాడు.

## మరి పిల్లలూ ఈ కథలో నీతి ఏమిటి ?

## లోభము ఎన్నటికీ కూడదు .. మనకి ఉన్న దాంట్లో పరులకు కూడ పెట్టి అప్పుడు మనము తినవలె అనే ఆలోచన ఎప్పుడూ చాలా మంచిది.

**Keywords: Nakka – Lobhamu katha, Telugu Jataka Kathalu, Telugu lo neeti kathalu, china pillala kadhalu, neeti vakyamulu**

**www.maganti.org**
**Vamsi M Maganti**
**contact@maganti.org**



PDF created with pdfFactory trial version www.pdffactory.com